కూరగాయల ధరలు..

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 45, పచ్చిమిర్చి 55 , బెండ 60, కాకర 40, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 35, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 100, వెల్లుల్లి 150.

ఉచిత వైద్య శిబిరం



చందానగర్: చందానగర్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో చందానగర్ మెడికవర్ హాస్పటల్స్ సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మనోజ్, మల్లికార్జున్, విజన్ ఐ హాస్పటల్ డాక్టర్ అబ్దుల్ సాహిద్‌లు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు కోటేశ్వరరావు గుప్తా, జైపాల్‌రెడ్డి, అంతిరెడ్డి పాల్గొన్నారు.

ఊరపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



రాయదుర్గం: శ్రావణ ఆదివారం సందర్భంగా రాయదుర్గంలోని శ్యామ్‌లేట్ వీధిలో కొలువుదీరిన ఊరపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేసిన తర్వాత ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 34 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులకు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది బిల్లు చెల్లించలేని పరిస్థితిలో ఉంటే ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం కొనసాగుతుందని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందవచ్చని తెలిపారు.

మియాపూర్‌కు తరలిన బీఆర్‌ఎస్ నేతలు

ఆల్విన్‌కాలనీ: మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌యస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి వివేకానందనగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ నుంచి మియాపూర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

వీరభద్రుడి ఆలయంలో లక్ష బిల్వార్చన



న్యాయమూర్తులతో ఆలయ కమిటీ సభ్యులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం శ్రీ భద్రకాళి వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం పాలకమండలి చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు లక్ష బిల్వార్చన నిమజ్జన పూజా క్రతువులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి, జిల్లా జడ్జి భవానిచంద్ర, ఆర్డీఓ రవీందర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి ధర్మకర్తల బృందంతో కలిసి వారికి మేళ తాళాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శస్త్ర గుప్తా, ఆలయ మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కేబుల్ కట్ చేశారు..
అలాగే వదిలేశారు..



నానక్‌రాంగూడలో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించి పడేసిన దృశ్యాలు





రాయదుర్గం: వారం రోజుల సమయం ఇచ్చినా టీవీ, ఇంటర్నెట్ కేబుల్‌లను ఆయా సంస్థలకు చెందిన వారు తొలగించకపోవడంతో ఆదివారం విద్యుత్ అధికారులు కేబుళ్లను తొలగించారు. అలా ప్రధాన, అంతర్గత రోడ్లపై ఉండే విద్యుత్ స్తంభాలకు ఉండే కేబుల్ వైర్లను కట్ చేసి అక్కడే పడవేసి వెళ్ళి పోయారు. దీంతో ఆ రోడ్లపై రాకపోకలు నిర్వహించే వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడుతున్నారు. విద్యుత్ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించినా, ప్రస్తుతం కేబుల్ వైర్లను కట్ చేసినా అలాగే వదిలేయడం పరిపాటిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. వాళ్ళు కట్ చేసినవి మేము తొలగించబోమని జీహెచ్ఎంసీ సిబ్బంది చెబుతున్నారు. విద్యుత్, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

శాంతిసరోవర్‌లో మెగా రక్తదాన శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ కుల్‌దీప్‌దీదీ తదితరులు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 152 మంది రక్తం దానం చేశారు. శిబిరాన్ని శాంతిసరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ దీదీ ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో స్వీకరించిన రక్తాన్ని ఎన్‌టీఆర్ బ్లడ్‌బ్యాంక్‌కు అందించారు. ఈ సందర్భంగా కుల్‌దీప్ దీదీ మాట్లాడుతూ.. దేశం మొత్తంలో రక్తదానం చేయడానికి ప్రత్యేక శిబిరాలను నిర్వహించామని గుర్తు చేశారు. బ్రహ్మకుమారీస్ సంస్థలు సేవ చేయడానికే రక్తదానం అన్ని దానాల్లో కెల్లా గొప్పదని గుర్తించి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు, రక్తదాతలు, వైద్య బృందం పాల్గొన్నారు.

నేడు వికలాంగుల మహాగర్జన సన్నాహక సదస్సు

కూకట్‌పల్లి: మూసాపేటలో సోమవారం నిర్వహించనున్న వికలాంగుల మహాగర్జన సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి తిప్పరపు లక్ష్మణ్ మాదిగ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా సోమవారం మూసాపేటలో చేయూత పెన్షన్ దారుల సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ఏపీలో ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచారని, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశాడన్నారు. దీనిపై ప్రతిపక్షాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కూకట్‌పల్లి,కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని రకాల చేయూత పెన్షన్‌దారులు మహాసభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దండోరా జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్వై అశోక్ మాదిగ, కేశపాగ రాంచందర్ మాదిగ, జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ, ముత్యపాగ శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



చందానగర్: మట్టి వినాయకులను పూజిద్దాం...పర్యావరణాన్ని కాపాడుదామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం చందానగర్‌లో మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మిరియాల ప్రీతమ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి డీసీసీ ఉపాధ్యక్షులు విజయ భాస్కర్‌లతో కలిసి ఆయన మట్టి విగ్రహాల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మిరియాల చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మిరియాల ప్రీతమ్, గిరి, టిల్లు, సాయి, మనీ, వెంకటేష్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చందానగర్: హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకలను ఆదివారం చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో చైర్మన్ కొండ విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ నెల 27 వరకు పంపిణి చేయనున్నట్లు తెలిపారు.

శ్రమను గౌరవించే దేశాల్లోనే అభివృద్ధి

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

పటాన్‌చెరు టౌన్: శ్రమను గౌరవించే సంస్కృతి ఉన్న దేశాలు మాత్రమే అభివృద్ధి చెందుతాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. మనదేశ జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు ఉత్పత్తిలో భాగస్వాములైతేనే నిజమైన అభివృద్ధి సాధించినట్లు అవుతుందన్నారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40వ వార్షికోత్సవ కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఒక ప్రైవేట్ పరిశ్రమలో ఒకే నాయకత్వంలో నిరంతరాయంగా 40 ఏళ్ల పాటు ఐక్యంగా కొనసాగడం అభినందనీయమన్నారు. సీఐటీయూ సిద్ధాంతాలకు లోబడి మొదటినుంచీ కార్మికులను రాజకీయ చైతన్యం చేసుకుంటూ ప్రజాతంత్ర పని విధానం ద్వారా శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అనేక అద్భుత విజయాలను సాధించిందని చెప్పారు. కేవలం తమ జీతభత్యాల కోసమే కాకుండా సామాజిక, సంఘీభావ కార్యక్రమాలలో సైతం చురుగ్గా పాల్గొంటూ ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచిందని అభినందించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నైబర్ హుడ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పరిధి కేసీఆర్ నగర్‌లో మెగా జాబ్‌మేళా, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ గారి రమణ మాట్లాడుతూ.. ప్రభుత్వ డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసముండే వారికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో జాబ్ మేళా నిర్వహించామన్నారు. అలాగే, ఉచిత వైద్య శిబిరం నిర్వహించమన్నారు. కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని చెప్పారు. రానున్న రోజుల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవ కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

వరద నీటి సమస్యను పరిష్కరించండి



రాఘవేంద్ర నగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఇటీవల కురిసిన వర్షాలకు ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వరద నీటి సమస్యపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వర్షపు నీటితో పాటు మట్టి కూడా రోడ్డు మీదకు రావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలని కోరారు. భారీ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులు, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టి గౌడ్, ఆంజనేయ ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తాచాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్

మణికొండ: సీబీఎస్ఈ పాఠశాలల స్థాయి అండర్-14, 17 విభాగాల్లో జరిగిన తైక్వాండో పోటీలలో మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని మౌంట్ లిటేరా జీ స్కూల్ విద్యార్థులు రాణించారు. సీబీఎస్ఈ సౌత్ జోన్-1 చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 21వ తేదీ నుంచి ఆదివారం వరకు ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా మార్కాపురంలో నిర్వహించారు. అందులో పాల్గొన్న జీస్కూల్ విద్యార్థిని అండర్-14 విభాగంలో కాంస్య పతకం, అండర్-17 విభాగంలో ధృతి కాంస్య పతకాలను సాధించారని కోచ్ డి.వెంకటేశ్ తెలిపారు. రాబోయే రోజుల్లో జరిగే మరిన్ని చాంపియన్ షిప్ పోటీలలో తమ విద్యార్థులు మరిన్ని పతకాలను సాధించి రాణిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తమ పాఠశాల విద్యార్థులు సౌత్ జోన్ స్థాయి పోటీలో పతకాలను సాధించటంతో యాజమాన్యం వారిని ప్రత్యేకంగా అభినందించిందని కోచ్ తెలిపారు.



ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం అరణ్య నాట్యం గురువు సమతారావు శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. కళాకారులు అద్విక, ప్రేరణ, రిషిక, అక్షర, పాలక్, మహేశ్వరీ, అద్వైత, శ్రేయశ్రీ, వినుత, శ్రీజిత, అలేఖ్య, యశస్విని, ఆరాధ్య, వైష్ణవి, ఖుషి, త్రిశ్విక, చేతన, సంరిద్ధి, కవిత తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

చెట్ల కొమ్మల తొలగింపు



శ్రీవివేకానందనగర్‌లో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్, శ్రీ వివేకానందనగర్ రోడ్డు నెంబర్ 9లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్ సమస్యను అధికారులుపరిష్కరించారు. ఇంటర్నెట్ కేబుళ్ల కారణంగా విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఇరుక్కు పోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. స్థానికులు సమస్యను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన జీహెచ్ఎంసీ అధికారులకు సమస్యను వివరించారు. దీంతో ఆదివారం విద్యుత్ సిబ్బంది కరెంటు వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సహకారంతో కాలనీలో అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్,రమేష్ ఆచారీ, సతీష్‌రెడ్డి, జయరాం పాల్గొనానరు.



పాలమాకులలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

మొక్కలతో కళకళ

విజయవంతంగా వనమహోత్సవం | కనువిందు చేస్తున్న పచ్చదనం
ఏపుగా పెరుగుతున్న మొక్కలు



మణికొండ దళిత శ్మశాన వాటికలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

రాజేంద్రనగర్ జోన్ బృందం: గడచిన 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు వన మహోత్సవ కార్యక్రమంలో నాటిన మొక్కలు కళకళలాడుతున్నాయి. రోడ్లు, బస్తీలు, కాలనీలు, ఖాళీ ప్రదేశాలు, శ్మశాన వాటికలు, పార్కులు, డివైడర్‌లు ఎక్కడ చూసినా పచ్చటి చెట్లు కనిపిస్తున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని 21 గ్రామ పంచాయతీలు, ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, ఒక జీహెచ్ఎంసీ సర్కిల్‌లో వన మహోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు.

- మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే వర్షాలు పడటంతో మొక్కలు కాస్తా నాటుకొని ఏపుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం నాటిన మొక్కలతో పాటు గతంలో నాటిన మొక్కలు కాస్తా చెట్లుగా ఎదిగి కనువిందు చేస్తున్నాయి. ఈ పచ్చటి తోరణాలు రోడ్లకు, బస్తీలకు, కాలనీలకు కొత్త హంగులను తీసుకొచ్చాయి.

10.65 లక్షల మొక్కలు...

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అధికారులు 10.65 లక్షల మొక్కలను నాటాలని టార్గెట్‌గా విధించారు. మణికొండ మున్సిపాలిటీలో 2.30 లక్షలు, నార్సింగ్ మున్సిపాలిటీలో 1.19 లక్షలు, శంషాబాద్ మున్సిపాలిటీలో 1.78 లక్షలు, శంషాబాద్ గ్రామ పంచాయతీల్లో 1.68 లక్షలు, బండ్లగూడ కార్పొరేషన్‌లో 2.30 లక్షలు, రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ పరిధిలో 1.40 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు.

విద్యుత్ వైర్ల కింద నాటొద్దు



బస్తీలు, కాలనీలు, రోడ్ల పక్కన వన మహోత్సవంలో మొక్కలు నాటుతున్నారు. విద్యుత్ వైర్ల కింద ఈ మొక్కలను నాటుతుండటంతో పెరిగిన కొన్ని రోజులకే విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది వీటిని అడ్డదిడ్డంగా నరికివేస్తున్నారు. దీంతో ఏపుగా పెరిగిన మొక్కలను ఎందుకూ పనికి రాకండా పోతున్నాయి. అధికారులు విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటవద్దని మనవి. – కృష్ణారావు, బండ్లగూడ



బండ్లగూడ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

ఇందుకు గాను ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. ఈ నర్సరీలో పెంచిన మొక్కలలో ఆయా ప్రాంతాల్లో నాటుతున్నారు.

అన్ని రకాల మొక్కలు...

వన మహోత్సవ కార్యక్రమంలో నాటేందుకు నర్సరీలలో అన్ని రకాల మొక్కలను పెద్ద ఎత్తున పెంచారు. పూలు, పండ్లు, ఔషధ మొక్కలతో పాటు గ్రీనరీని పెంచే మొక్కలను సైతం పెంచారు. ప్రస్తుతం ఈ మొక్కలన్నింటినీ ప్రత్యేకంగా నాటుతున్నారు. కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లలో నివాసముంటున్న వారికి ఉచితంగా మొక్కలను అందజేస్తున్నారు.

- గతంలో ఎన్నడూ లేని విధంగా ఔషధ మొక్కలను పెంచి పంపిణీ చేస్తుండటంతో వీటికి మంచి డిమాండ్ ఉంది. ప్రజలు స్వచ్ఛందంగా ఔషధ మొక్కలు, పూల మొక్కలను ఎక్కువగా తీసుకుంటున్నారు. ప్రజల ఆసక్తికి గుర్తించిన అధికారులు ప్రతి ఇంటికీ వారు కోరిన ప్రమాకం మొక్కలను అందజేస్తున్నారు.



నార్సింగి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఏపుగా పెరిగిన మొక్కలు

నాటింది 8.53 లక్షల మొక్కలు...

నియోజకవర్గంలో అధికారులు విధించిన టార్గెట్‌ను 80 శాతం పూర్తి చేశారు. మిగిలిన 20 శాతం టార్గెట్‌ను ఈ నెల చివరి వరకు పూర్తి చేసేందుకు అధికారులు తగు కార్యక్రమాలను చేపడుతున్నారు.

- మణికొండ మున్సిపాలిటీలో 1.90 లక్షలు, నార్సింగ్‌లో 1,12,120, శంషాబాద్ 1,68,200, బండ్లగూడ కార్పొరేషన్‌లో 2 లక్షలు, శంషాబాద్ గ్రామ పంచాయతీల్లో 63 వేలు, రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్‌లో 1.20 లక్షల మొక్కలను నాటారు.

రోడ్లు రూపురేఖలు మారుస్తాయి



రోడ్ల మధ్యలో మొక్కలు నాటడంతో వాటి రూపురేఖలు మారుతున్నాయి. ప్రయాణికులకు ఆహ్లాదకరంగా మొక్కలు కనిపిస్తున్నాయి. ఖాళీ స్థలాలు ఉన్న ప్రతి చోట మొక్కలు నాటాం. డివైడర్లకు మంచి రంగులు, బొమ్మలు వేయడంతో మరింత శోభ వచ్చింది. ప్రజలు అవకాశం ఉన్న ప్రతి చోటా మొక్కలను నాటి పరిసరాలను పచ్చదనంతో నింపాలి. – కృష్ణమోహన్ రెడ్డి, నార్సింగి మున్సిపల్ కమిషనర్